www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 13 సెప్టెంబర్ 2023
5
కాకినాడ

మండల స్థాయి క్రీడలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఏపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలు 14, 15 తేదీల్లో నిర్వహించేందుకు సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య చెప్పారు. మంగళవారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. 14న అండర్-14 బాలురు, 15న అండర్-17 బాలికలకు పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలకు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనొచ్చన్నారు. పాల్గొనే విద్యార్థులు వారి ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు, మండల కో-ఆర్డినేటర్లు శ్రీదేవి, తాళ్లూరి వైకుంఠం, వెంకటేష్‌లు చెప్పారు. తొమ్మిది క్రీడాంశాలకు ఎంపికలు నిర్వహిస్తారన్నారు.

పేదల వైద్యాన్ని పట్టించుకునేవారేరీ?

కాకినాడ జిజిహెచ్‌లో ఒపి సేవలు అరకొరే
పని చేయని ఎంఆర్‌ఐ స్కానింగ్
కనీస స్థాయిలో అందుబాటులో లేని పరికరాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో సుమారు కోటి జనాభాకు ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పేదలకు సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. 1,150 పడకల సామర్థ్యం కల్గిన జిజిహెచ్‌కు రోజుకి సరాసరి 3 వేల మంది వైద్యం కోసం వస్తున్నారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సహా పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల నుంచే కాకుండా ఏజెన్సీ మండలాలైన అల్లూరి జిల్లా నుంచి కూడా రోగులు తాకిడి ఉంది. ఏటా 13 లక్షల మందికి పైగా వైద్య సేవలను పొందుతున్నారు. అయితే ఓపి సేవలు మధ్యాహ్నం 12 గంటలకే ముగిస్తుండడంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఓపి కౌంటర్ వద్దకు వెళ్లి పేరు, వచ్చిన రోగం వివరాలు చెబితే ఓపి చీటీ ఇచ్చేవారు. కొన్ని నెలలుగా పలుమార్లు నిబంధనల్లో మార్పులు చేస్తున్నారు. ప్రస్తుతం టోకెన్ నెంబర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో అనేక అవస్థలను ఎదుర్కోవాల్సి వస్తుందని రోగులు వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల కల్పనపై దృష్టి

రోగుల తాకిడి ప్రతిరోజూ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆసుపత్రిలో ప్రధాన సౌకర్యాలపై దష్టిని సారించాం. ఎంఆర్‌ఐ స్కానింగ్ పరికరం మరో నెల రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కొత్త యంత్రాన్ని బిగించే పనులు పూర్తి కావస్తున్నాయి. రోగులకు అవసరమైన పరికరాలను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ హేమలత దేవి, సూపరింటెండెంట్, జిజిహెచ్

జిజిహెచ్‌లో రోగులు

ఎంఆర్‌ఐ స్కానింగ్ పనిచేసేది ఎప్పుడో?

జిజిహెచ్‌లో 2013లో ఎంఆర్ఐ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో రోజుకు 10 నుంచి 15 మంది స్కాన్ చేయించుకునేందుకు వచ్చేవారు. అనంతరం ఒపి సేవలు బాగా మెరుగుపడడంతో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ఇక్కడికి స్కానింగ్ చేయించుకునేందుకు వస్తున్నారు. మెడల్ సంస్థ తర్వాత 2017 నుంచి ఎస్ఎల్ డయాగ్నొస్టిక్ సంస్థ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్నది. అప్పటి నుంచి రోజుకు 25 నుంచి 30 వరకు స్కానింగ్‌లు జరిగేవి. అంటే నెలలో సరాసరి 500 వరకూ రాత్రిళ్ళు,పగలు స్కానింగ్ లు తీసేవారు. ప్రస్తుతం ఏడాదిన్నర కాలంగా ఈ స్కానింగ్ యంత్రం పూర్తిగా మరమ్మతులకు గురవడంతో సేవలు నిలిచిపోయాయి. అయితే కీలకమైన ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకునేందుకు బయట మార్కెట్లో రూ. 6వేలు నుంచి 10 వేలు బిల్లు మోగిస్తుండడం పేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రోగులకు తప్పని యాతన

వైద్య పరికరాల కొరతతో రోగులు నరకయాతన పడుతున్నారు. తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి వివిధ పరీక్షలు చేసేందుకు క్యాజువాలిటీ, వార్డుల నుంచి తీసుకువెళ్లడానికి స్ట్రెచ్చర్లు, వీల్ ఛైర్లు పూర్తిస్థాయిలో అందుబాటులోలేక గగ్గోలు పెడుతున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు చేతులపై ఎత్తుకుని సీటీస్కాన్, ఎక్స్ రే, తదితర పరీక్షలకు తీసుకువెళ్లే దుస్థితి నెలకొంది. అధికారులు దృష్టి సారించి పరికరాల కొరతను అధిగమించాలని రోగులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా

ఓటర్ల పరిశీలన నూరుశాతం పూర్తి

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా పున:పరిశీలన నూరుశాతం పూర్తి అయ్యిందని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ -2024 ప్రక్రియ, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపు అభ్యంతరాల పరిష్కారం, ఓటర్ల పున్న పరిశీలన, పోలింగ్ కేంద్రాల మార్పు, ఎపిక్ కార్డుల జనరేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికాశుక్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 2022 జనవరి 6 నుంచి, 2023 ఆగస్టు 9 వరకూ మరణించిన, ఆచూకీ లభించని కేసులన్నీ పున్నపరిశీలన చేపట్టామన్నారు. నిర్దేశిత గడువులో దీన్ని పూర్తి చేశామన్నారు. జిల్లాలో 1,634 పోలీస్ స్టేషన్‌లో పరిధిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించే నిమిత్తం ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తున్నా మన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షేప సవరణ జాబితా- 2024 రూపకల్పనపై చేపట్టిన ఓటర్ల పున్న పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు వంటి అంశాలపై చర్చించారు. కొత్త ఓటు నమోదుకు 2024 జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అన్ని బూత్ స్థాయి ఏజెంట్స్ నియామకం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.జగన్నాథం, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాకెట్ నమూనాలకు పూర్వ వైభవం

ప్రజాశక్తి - కాకినాడ

చంద్రయాన్ 3 విజయోత్సవ వేడుకల్లో భాగంగా పిఆర్.కాలేజ్ పూర్వ విద్యార్థి హరిష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ చైర్మన్ తలాటం హరీష్ కాలేజీలో మరుగున పడ్డ రాకెట్ నమూనాలకు పూర్వ వైభవం తీసుకురావడం అభినందనీయమని పిఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ తిరుపాణ్యం పేర్కొన్నారు. కాకినాడ పిర్.కాలేజ్ డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫిజిక్స్ మ్యూజియంలో చంద్రయాన్-3 విజయోత్సవాల్లో భాగంగా హరిష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ సౌజన్యంలో కాలేజ్లో ఆధునికీకరించిన ఇస్రో రాకెట్స్ నమూనా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి పీడీ వర్మ స్వాగతం పలికారు. కాలేజ్ ప్రిన్సిపాల్ తిరుపాణ్యం ముఖ్యఅతిథిగాను హరిష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ చైర్మన్ తలాటం హరీష్ విశిష్ట అతిథిగాను, ఒల్డ్ స్టూడెంట్స్ అలుమిని కార్యదర్శి సత్య స్వరూప్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తిరుపాణ్యం మాట్లాడారు. హరిష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ చైర్మన్ హరీష్ కాలేజ్ అభివద్ధికి చేస్తున్న కషి ప్రశంసనీయమన్నారు. ఓల్డ్ స్టూడెంట్స్ అలుమిని కార్యదర్శి సత్యస్వరూప్ మాట్లాడుతూ హరిష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ వినూత్న సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తు అందరి మనన్నలు పొందుతుందన్నారు. చారిటబు ల్ ఆర్గనైజేషన్ చైర్మన్ తలాటం హరిష్ మాట్లాడుతూ కాలేజ్ లో 3వేలకు పైగా విద్యుర్థులు ఉన్నారని ఎవరైన విద్యార్థికి సమస్య వచ్చినప్పుడు అందరూ సాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం తలాటం హరీష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రౌండ్ యుజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పంపన సాయి, అధ్యాపకులు రమణ, జయదేవ్ పి. ఆర్. కాలేజ్ ఫిజిక్స్ డిపార్టెమెంట్ అద్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన కార్యశాల

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సారథ్యంలో ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశం పై ఆరు రోజుల పాటు జరిగిన వర్క్‌షాపు మంగళవారంతో ముగిసిందని ప్రిన్సినపల్ డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో విశేష సేవలందిస్తున్న వి.అనిల్‌కుమార్ నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో క్లౌడ్ కంప్యూటింగ్, ఎడబ్ల్యూఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, అకాడమిక్స్ డీన్ డాక్టర్ పుల్లెల రవికుమార్, విభాగాధిపతి డాక్టర్ జిఎస్ఎన్.మూర్తి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

4న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలోని శ్రీ శృంగార వల్లభస్వామి ఆలయంలో ఈనెల 14న హుండీల ఆదాయాన్ని లెక్కిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించిన అధికారుల సమక్షంలో రెవెన్యూ, పోలీస్, ధర్మకర్తల మండలి చైర్మన్, ధర్మకర్తలు సమక్షంలో హుండీలను తెరచి ఆదాయ లెక్కింపు జరుపుతారన్నారు.

విజ్ఞాన దాయకంగా గూగుల్ డెవలపర్ స్టూడెంట్ క్లబ్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో గూగుల్ డెవలపర్ స్టూడెంట్ క్లబ్ విజ్ఞానదాయకంగా జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు. వెర్షన్ కంట్రోల్, ఓపెన్ సోర్స్ కాంట్రిబ్యూషన్ అనే అంశంపై సిఎస్ఇ నాల్గవ సంవత్సరం విద్యార్థులు మూడు, రెండో సంవత్సరానికి చెందిన సుమారు 100 మంది విద్యార్థి బృందంతో కలిసి సాంకేతిక జ్ఞానాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు లాభదాయకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, సిఎస్ఇ సిబ్బంది, జిడిఎస్‌సి విద్యార్థి సమన్వయకర్త ఎస్.నాని పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాన్ని నిర్మించాలి

ప్రజాశక్తి- పిఠాపురం

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనాన్ని నిర్మించాలని, ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరహాలు, ఎం.గంగాసూరిబాబు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి సంగ్రామం సైకిల్ యాత్ర మంగళవారం పిఠాపురం చేరుకుంది. ఈ యాత్రకు ఎస్ఎఫ్ఐ, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బృందం పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలను సందర్శించింది. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరహాలు, సూరిబాబు మాట్లాడారు. నేడు పాలకులు పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను తిరోగమన దిశలో నడిపిస్తున్నాయన్నారు. విద్యారంగం ప్రయివేటీకరణకు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూనుకుంటుందని విమర్శించారు. పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో షిఫ్టుల వారీగా క్లాసులను నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఫలితంగా విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని, జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతుల నిర్మాణాలను తక్షణం పూర్తి చేయాలన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు నిర్మాణ పనులు పూర్తిచేసి తరగతులను ప్రారంభించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. జిఒ 77ను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మిడ్డేమీల్స్‌ను కొనసాగించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఈ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ఈ యాత్రలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు జి.శ్రీకాంత్, కె.సిద్ధు, రాజు, కె.రాజేష్, నాని, పవన్, గోపాల్, చిన్ని, శైలు, సువర్ణ, శాంతి, ప్రజా సంఘాల నాయకులు కోనేటి రాజు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న గంగాసూరిబాబు

రిలయన్స్ పరిహారం అందేలా కృషి : ఎంఎల్ఎ ద్వారంపూడి

ప్రజాశక్తి - కాకినాడ

రిలయన్స్ కార్యకలాపాల నేపథ్యంలో ఇచ్చే పరిహారాన్ని కాకినాడ ప్రాంత మత్స్యకారులకు కూడా అందేలా కషి చేస్తానని సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన స్థానిక 15వ డివిజన్ ఏటిమొగ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగర అధ్యక్షులు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు అధికారులు, నాయకులు కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 14, 15 డివిజన్లు మినహా నగరమంతా గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తయిందన్నారు. రిలయన్స్ కార్యకలాపాల వల్ల నష్టపోతున్న ముమ్మిడివరం, యానాం పరిసర ప్రాంత మత్స్యకారులకు పరిహారం ఇస్తున్న విధంగానే ఈ ప్రాంత వాసులకూ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పరిహారం చెల్లింపు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఏటిమొగ ప్రాంతంలో తనకు మెజారిటీ ఇవ్వకపోయినా, రాజకీయాలకతీతంగా మత్స్యకారుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశానన్నారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి చేస్తున్నామన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు కూడా ఆశీర్వదించాలని, జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు కాటాడి జానకిరామ్, భీమరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దోచుకున్న గజదొంగ బాబు

మంత్రి దాడిశెట్టి రాజా

ప్రజాశక్తి - కోటనందూరు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాధనాన్ని దొంగలించిన గజదొంగ చంద్రబాబు నాయుడు అని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం తేటగుంటలో వైఎస్ఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా మంజూరైన ఇళ్ల పట్టాల పంపిణీ, రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి రాజా మాట్లాడారు. కుంభకోణాలను చేయడంలో చంద్రబాబు ఘనుడు అన్నారు. పోలవరం, అమరావతి, పట్టిసీమ, హెరిటేజ్‌లో బెల్లం మజ్జిగల్లో రూ.లక్షల కోట్ల కుంభకోణం చేశాడన్నారు. నేడు జైళ్లో ఊసలు లెక్కిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో యనమల రామకృష్ణుడూ జైలు ఊసలు లెక్కించడం ఖాయమన్నారు. సంక్షేమము అభివృద్ధి లక్ష్యంగా జగన్ పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాకినీడు బాబు, ఎంపిపి బొప్పన రాము, వైస్ ఎంపిపి సూరిశెట్టి సత్యనారాయణ పోతల రమణ, పోతల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

15న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోటలో ఈ నెల 15న సామర్లకోటలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. గురువారం ఎఐటియుసి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తతస్థాయి సమావేశం సంఘం నాయకులు పెద్దిరెడ్డి అర్జునరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండించారు. అనంతరం. దేశంలో వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. వామపక్షాలు పోరాట ఫలితంగా ఏర్పడిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పెదిరెడ్ల సత్యనారాయణ , మడగల రమణ, తదితర వ్యవసాయ కార్మిక సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులకు ఈ నెల 13,14,15 తేదీల్లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023 గోడపత్రికను మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో జాతీయ బాలల సైన్స్ కాంగెస్‌లో ప్రాజెక్టుల తయారీ కోసం వివరిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనే అంశంపై సైన్స్ ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. జిల్లాలో మూడు ప్రాంతాల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్, అన్నవరం ఎస్‌వివిడిఒహెచ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఈ తరగతులు ఉంటాయన్నారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు శిక్షణ తరగతులు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంఇఒ సిహెచ్.రవి, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి వెంకట్రావు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, సమగ్ర శిక్ష ఐఇ కో-ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, జగ్గంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.రంగారావు, నూకరాజు, పట్టబి, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, అకడమిక్ కో-ఆర్డినేటర్ కె.వెంకటరావు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. ఇతర వివరాలకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు (9912703697)ను సంప్రదించాలన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ తదితరులు

కార్టూ'నిజం'



ఎల్ఐసి ఏజెంట్లు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కోటనందూరు

తుని ఎల్ఐసి బ్రాంచ్ ఏజెంట్ల మూడవ జనరల్ బాడీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మంగళవారం తుని పట్టణంలో మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఎల్ఐసి ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా సాగాయి. ఎల్ఐసి రాజమహేంద్రవరం డివిజన్ ప్రెసిడెంట్ వై.విశ్వేశ్వరరావు, స్థానిక నాయకులు కలదిండు సత్యనారాయణరాజు, తుని బ్రాంచ్ మేనేజర్ జి.సత్యనారాయణ సమక్షంలో నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షులుగా పి.రాంబాబు, సలహాదారునిగా ఎస్.చెంచయ్య, ప్రెసిడెంట్‌గా ఐ.వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా టి.అప్పారావు, నీలి రాంబాబు, జివి.సత్యనారాయణ, సెక్రటరీగా మైలపల్లి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా బి.రామకృష్ణ, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

సోలార్ మిషన్ విధానంలో ఎండి చేపల తయారీ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

సోలార్ మిషన్ ద్వారా ఎండి చేపల తయారీ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ఫిష్ ప్రాసెసింగ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పాడ మహిళా సమాఖ్య కార్యాలయంలో జోనల్ ఆఫీసర్ మారుతి ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలితగా ఉప్పాడ మహిళా సమాఖ్య కార్యాలయంలో సోలార్ మిషన్ ద్వారా ఎండి చేపల తయారీ విధానాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేయూత డిపిఎం రాయ్, స్త్రీ నిధి ఎజిఎం చిట్టిబాబు, డిఆర్‌పిలు బాల, సింధు, తదితరులు పాల్గొన్నారు

ఒడిగోస్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

స్థానిక రమణయ్యపేటలో విజెఎస్ఎంఆర్ ఒడిగోస్ సేవలు అభినందనీయమని కుడా చైర్మన్ చంద్రకళాదీప్తి అన్నారు. ఒడిగోస్ కార్యాలయంలో ఐడిఎ సర్టిఫికెట్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఒడిగోస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉన్నత విలువలతో కూడి సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో తర్ఫీదు ఇచ్చేందుకు సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. వినోద్ మాట్లాడుతూ అత్యంత ప్రమాణాలు కలిగిన ఐఎస్ఒతో పాటూ ఢిల్లీకి చెందిన ఐడిఎతో అసోసియేట్ అవ్వడం ద్వారా విద్యార్థులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. వైసిపి నాయకులు జంగా గగారిన్ మాట్లాడుతూ విజెఎస్ఎంఆర్ ఒడిగోస్‌తో ఐడిఎతో అసోసియేట్ అవ్వడం చాలా సంతోషకరమన్నారు. పోస్టల్ నాయకులూ వార సత్యనారాయణ మాట్లాడుతూ ఒడిగోస్ దినదినాభివృద్ధి చెందడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జి.విల్సన్, వారా మేరీజ్యోతి, ఉషారాణి, ఎం.బుజ్జి, కె.సుభాష్, నాని, బాలు, నదీష్, బ్రాంచ్ మేనేజర్ శిరీష, ఆపరేషన్స్ మేనేజర్ కుమార్, మౌలిక, నిఖిల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని నాగులపల్లి వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. మూలపేట పంచాయతీ కార్యాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి పౌష్టిక ఆహారంపై హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారావు అవగాహన కల్పించారు. స్థానిక జడ్‌పి హైస్కూల్ సందర్శించి బాలికలకు, బాలురుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

జగన్ కక్షపూరిత విధానాలను మానుకోవాలి

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ కక్ష పూరిత విధానాలను మానుకోవాలని టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య అన్నారు. బాబు అరెస్టు నిరసగా మంగళవారం తేటగుంటలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడారు. జగన్ రాజకీయ కక్షతోనే చంద్రబాబును జైల్లో పెట్టారన్నారు. ఎన్ని కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో చంద్రబాబే ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పి.శేషగిరిరావు, ఎం.వెంకటేష్, ఎస్.లోవరాజు, ఐ.సత్యనారాయణ, వి.బుజ్జి, సిహెచ్.అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న దివ్య

నేరాలు ఘోరాలు

రూ.15 లక్షల విలువైన మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో సుమారు రూ.15.26 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసినట్లు సెబ్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు తాళ్లరేవు, కాకినాడ సౌత్, కాకినాడ నార్త్, పిఠాపురం ఎస్ఇబి స్టేషన్లలో సుమారు 702 కేసుల్లో సీజ్ చేసిన పన్ను చెల్లించిన 12,551 మద్యం బాటిళ్లతోపాటు పన్ను చెల్లించని 3,708 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. మండల పరిధిలోని పోలేకుర్రు గ్రామ శివారులో గల ఖాళీ ప్రదేశంలో మద్యాన్ని ధ్వంసం చేసిన కార్యక్రమంలో సెబ్ అధికారులు పి.సునీల్ కుమార్, జెవి భవానీ, కె.రామ్మోహనరావు, కెవి.స్వామి, ఐ. నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

-స్నేహితుడు పుట్టినరోజుకి కేకు తెచ్చేందుకు వెళుతూ ప్రమాదానికి గురై చెవల మణికంఠ(23) అనే యువకుడు మృతి చెందాడు. మరొక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోరంగి పంచాయతీ సీతారామపురం గొల్లల పేట రామాలయం వీధి లో మణికంఠ, అతని స్నేహితుడు గున్నూరి అశోక్ ఇరువురు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరి యానాం వెళ తుండగా, జార్జీపేట మలుపులో బైక్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మణికంఠ అక్కడికక్కడే మృతి చెందగా, అశోక్ కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అందరితో కలివిడిగా ఉండే మణికంఠ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలముకుంది. డిగ్రీ పూర్తిచేసి ఇటీవలే ప్రైవేటు ఉద్యోగంలో చేరిన మణికంఠ తమ కుటుంబానికి ఆసరాగా ఉంటాడని అనుకుంటే అర్ధాంతరంగా కనుమరుగై పోయాడని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వడ్లమూరులో దుర్గమ్మ గుడి వద్ద 2014 జనవరి 29 రాత్రి జరిగిన షేక్ నాగూర్ సాహెబ్ హత్య కేసులో నిందితుడు షేక్ అబ్దుల్లాకు 7వ అదనపు జిల్లా కోర్టు జడ్జి నికిత ఆరోరా యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ నాగూర్ సాహెబ్ ,షేక్ అబ్దుల్లాకు రూ.200 బాకీ ఉన్నాడు. ఈ డబ్బులు వసూలు విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. నాగూర్ అబ్దుల్లాను కొట్టగా అబ్దుల్లా పెద్దాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నాగూర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్‌పై వచ్చిన నాగూరు 2014 జనవరి 29 రాత్రి దుర్గమ్మ గుడి వద్ద అబ్దుల్లాతో ఘర్షణకు దిగాడు. ఈ ఘర్షణలో అబ్దుల్లా నాగూరు తలపై ఇనపరాడ్డుతో విచక్షణారహితంగా కొట్టగా అక్కడకక్కడే మతి చెందాడు. ఈ మేకు అప్పటి ఎస్సై శివ కృష్ణ కేసు నమోదు చేశారు. సిఐ కె.నాగేశ్వరరావు చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేరిశెట్టి మృత్యుంజయరావు వాదించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని మల్లిశాల వెంగయమ్మపురం గ్రామాల్లో జగ్గంపేట సిఐ సూర్య అప్పారావుకు వచ్చిన సమాచారం మేరకు పేకాట శిబిరాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నామనిసిఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని, బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

కార్మికునికి మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం సత్యగిరి కొండపైన కొత్తగా నిర్మించిన శివ సదన్ సత్రంలో మంగళవారం జరుగుతున్న వాటర్ వర్క్స్ నిర్మాణ పనుల్లో శుభరాంజీ అనే కార్మికునిపై ప్యానల్ బోర్డు పడింది. ఈ ప్రమాదంలో రాంజీ తీవ్రంగా గాయపడ్డాడు. దేవస్థానం అధికారులు హుటాహుటిన బాధితున్ని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఒక కార్పోరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు దీనితో బాధితుడు కోలుకున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

గడ్డి మందు తాగిను యువకుడు మృతి చెందాడు. రాజుపూడికి చెందిన పల్లంశెట్టి శివసుబ్రహ్మణ్యం(27) ఈనెల 7న గడ్డి మందు తాగాడు. అతన్ని కుటుంబ సభ్యులు వెంటే కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 10న మృతి చెందాడు. తండ్రి పల్లంశెట్టి భాస్కరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోర్ట్ ఆదేశానుసారమే పాస్‌బుక్ మంజూరు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల సస్పెన్షన్ గురైన ప్రత్తిపాడు తహాశీల్దార్‌కు న్యాయస్థానం ఆదేశానుసారమే పాస్ బుక్ మంజూరు చేశారని రైతు సత్తి వినోద్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపాడు మండలంలోని ఈ గోకవరానికి చెందిన 10.26 ఎకరాలు భూమిని తాను కొనుగోలు చేశానన్నారు. ఈ విషయమై ఫిర్యాదుదారుడు గతంలోనే తనకు ఎటువంటి హక్కులు లేవని రాసి ఇచ్చారని, ఈ భూమి నిమిత్తం పలు న్యాయస్థానాల్లో తనకు అనుకూలంగా తీర్పులు వచ్చాయన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్‌డిఒ సిఫార్సుతో తహాశీల్దార్ గోపాల కృష్ణ తనకు పాస్ పుస్తకం మంజూరు చేశారని తెలిపారు. ఈ విషయమై తహాశీల్దార్‌ను సస్పెండ్ చేయడంతో పాటు కొంతమంది తనకిచ్చిన అడంగల్, 1బి, పాసుబుక్కును రద్దు చేస్తారని బెదిరిస్తున్నారన్నారు. ఈ మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ చీఫ్ కమిషనర్ కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అందరూ స్పందించాలి

టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఎంఎల్ఎ గోరంట్ల పిలుపు గామన్ బ్రిడ్జిపై రాస్తారోకో

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నాదెండ్ల వెన్నుపోటు సమయంలో స్పందించిన విధంగా ప్రస్తుతం అందరూ స్పందించాలని రూరల్ ఎంఎల్ఏ గోరంట్ల బుచ్చయ్య చౌదరి టిడిపి నాయకులు, కార్యకర్తలక పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో జిల్లా టిడిపి సర్వసభ్య సమావేశం కాతేరు వద్ద గల వెంకటాద్రి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. అనంతరం 'బాబుగారికి తోడుగా ఒక నియంతపై పోరాటానికి మేము సైతం' గామన్ బ్రిడ్జిపై రాస్తారోకో చేపట్టారు. కొద్దిసేపటికే పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించడంతో నేతలు వెనక్కి తగ్గారు. తొలుత నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఏ గోరంట్ల మాట్లాడుతూ టీడీపీ స్పీడ్ ని బ్రేక్ చెయ్యాలనే దురుద్దేశ్యంతో జగన్ నీతిమాలిన రాజకీయానికి తెరలేపారని మండిపడ్డారు.చంద్రబాబు అరెస్టును ముందుగా కార్యకర్తలు జనాల్లోకి వివరణ తీసుకువెళ్ళాలని అన్నారు. చంద్రబాబు అరెస్ట్ వివరాలను కరపత్రాలు ముద్రించి, ప్రతి ఇంటికి అందించనున్నట్లు తెలిపారు. ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తే, జగన్ ను చెప్పుతో కొట్టినట్టు బుద్ధి వస్తుందని అభిప్రాయ పడ్డారు. రెండవ దశలో ప్రతీ గ్రామంలోనూ రిలే నిరాహార దీక్షలు చేయాలని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ అవసరం అయితే అందరూ కలిసి జైలుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉందామని అన్నారు.పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర, చంద్రబాబు నీటి పారుదల ప్రాజెక్టుల సందర్శన, తదితర కార్యక్రమాల వల్ల అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల బ్యాడ్జీలు ధరించి మాజీ ఎంఎల్ఏలు, జిల్లా స్థాయి టీడీపి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గామన్ బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, ఓటర్ల తొలగింపు తదితర క్లెయిమ్‌ల ప్రగతిని వివరించారు. ఎ కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో కొత్త ఓట్ల నమోదు కోసం 4,697 దరఖాస్తులు రాగా, 1916 పరిష్కరించామన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో రెండేసి ఓట్లు, మరణించిన ఓటర్ల తొలగింపునకు 18,510 దరఖాస్తులు రాగా 10,717 పరిష్కరించామని, ఇంకా 7795 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇక ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు కోసం 33,353 దరఖాస్తులు రాగా 23,413 పరిష్కరించామని, ఇంకా 9946 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటన్నింటిని ఈ నెల 15వ తేదీలోపుగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్‌పై కూడా ఆయన రాజకీయ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. ఒకే ప్రాంగణంలో నాలుగు కన్నా ఎక్కువ పోలింగ్‌స్టేషన్లు ఉన్న ఏడు ప్రాంతాలను గుర్తించామన్నారు. అదనపు పోలింగ్ స్టేషన్లను ఓటర్లకు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉండే కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిదులు రావూరి వెంకటేశ్వరరావు, రాగిరెడ్డి సుబ్బారావు, ఎంజికె.కిషోర్, వెంకటేశ్వరరావు, వనమాడి వీరబాబు, అప్పారావు పాల్గొన్నారు.

జగన్‌కు మంచి మనస్సు ఇవ్వాలని అంబేద్కర్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కు మంచి మనస్సును ఇవ్వాలని కోరుతూ టిడిపి ప్రతిపాడు ఇన్‌ఛార్జి వరుపుల సత్యప్రభ, కార్యకర్తలు మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగంపై ఏమాత్రం అవగాహన లేని జగన్ బుద్ధి మార్చి నిజాయతీకి, నిబద్ధతకి మారుపేరైన చంద్రబాబు నాయుడు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బద్ది రామారావు, కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, జ్యోతుల పెద్దబాబు, సూతి బూరయ్య, బస ప్రసాద్, బొదిరెడ్డి గోపి, పాల్గొన్నారు.

'గిన్నిస్' కాకినాడ మహిళలకు స్థానం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడకు చెందిన ముగ్గురు మహిళలు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించారు. డొంక వీరసోమేశ్వరిదేవి తన తల్లి, కుమార్తెతో కలిసి మనోవికాస వ్యవస్థాపకరాలు సురుభట్ల మాధవి నేతత్వంలో 2,00,250 మంది గృహిణులతో ఆరు నెలల్లో 2,719 నూలు వస్త్రాలను తయారు చేశారు. వీటిని విశాఖలో ప్రదర్శించారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధి స్వప్నల్ డంగారికర్ పరిశీలించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరసోమేశ్వరీదేవి మాట్లాడుతూ కరోనా సమయంలో ఇంటి దగ్గరే ఉంటూ తన తల్లి చల్లంగి మహాలక్ష్మి, కుమార్తె ప్రియాంషీ ఆన్‌లైన్‌లో నూలుతో వస్త్రాలను ఎలా తయారు చేయాలో నేర్చుకున్నామన్నారు. కాకినాడలోనే మొదటిసారిగా గిన్నిస్ వరల్డ్ రికార్డు స్థానం సంపాదించడం సంతోషకరంగా ఉందన్నారు. తయారుచేసిన వస్త్రాలను గిరిజన ప్రాంతాల్లో మహిళలకు ఉచితంగా అందిస్తామన్నారు.

300 మందికి నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ పేర్రాజు పేటల విముక్తి కాలనీలో జెఎస్ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పుత్ర హనోక్ ఆధ్వర్యంలో 300 మంది కుష్టు వ్యాధి గ్రస్తులకు నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనోక్ మాట్లాడారు. సాటి మనిషికి సాయపడినప్పుడే మానవజన్మకు సార్థకత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తోచిన విధంగా సమాజానికి సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిలాంత్రోపిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా, డాక్టర్ మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు మోర్త ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాళ్లరేవులో స్పందన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల పరిషత్ సమావేశపు హాల్లో బుధవారం జిల్లాస్థాయి అధికారులతో కాకినాడ జిల్లా కలెక్టర్ కృతిక ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఏర్పాట్లను ఆర్‌డిఒ ఎన్‌విబి.సత్యనారాయణ మంగళవారం పర్యవేక్షించారు. ఆయన వెంట తహశీల్దార్ పోతురాజు ఉన్నారు.

బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ

బకాయి జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లింపులపై జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవికి జిజిహెచ్ డైట్ విభాగం(మెస్) కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ అధ్యక్షుడు ఏసూరి శంకర్ మాట్లాడారు. ప్రస్తుత కాంట్రాక్ట్ 2023 ఏప్రిల్ నెల నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. నాటి నుంచి కార్మికుల జీతాల నుండి పిఎఫ్, ఇఎస్ఐ సొమ్ము మినహాయిస్తున్నా ఆయా శాఖలకు చెల్లింపు జరగడం లేదన్నారు. జూలై ఆగస్టు నెలల జీతాలు నేటికీ చెల్లించలేదన్నారు.కార్మికులు కుటుంబ పోషణకు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై సూపరింటెండెంట్ స్పందిస్తూ కాంట్రాక్టర్ నుంచి పిలిపించి మాట్లాడి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు అనపర్తి ఏడుకొండలు, ఏసూరి శ్రీనివాస్, రాజశేఖర్, తణుకు వీరబాబు, దొరబాబు, వీరభద్రం తదితరులు సూపరింటెండెంట్ ను కలిసిన వారిలో ఉన్నారు. 15 వ తేదీ లోపు కాంట్రాక్టర్ వైపు నుండి స్పందన లేకపోతే సిఐటియు ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనకు చేపడుతామని యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

యానాం వార్తలు

కాలవలోకి చేరుతున్న మురుగునీరు

ప్రజాశక్తి -యానాం

యానాం నల్లచెరువు తూము నుంచి భీమ్ నగర్ వరకు గల మంచి నీటి కాలవలోకి రెండు రోజుల నుంచి మురిగు కాలువ నీరు కలుస్తోంది.. దీనిపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానాం ప్రజాపనులశాఖ అధికారులు ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. యుకెవి నగర్ వద్ద మంచినీటి కాలవను చేర్చి పైవాలున మురికినీటి డ్రెయినేజీని గతంలో నిర్మించారు. యుకెవి నగర్ వద్ద మురుగుకాలువవెంబడి ఉన్న తుప్పలను కొంతమేర తొలగించారు. అయితే తొలగించిన తుప్పలను మురికినీటి కాలవలో అడ్డంగా వేశారు. దీంతో మురగునీరు పక్కనే ఉన్న మంచినీటి కాలవలోకి చేరుతోంది. రెండు రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాధుడే కరవయ్యాడు. వర్షాలు వచ్చినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

15న జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 15న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 2న పార్లమెంట్ హౌస్ జాతీయ స్థాయి వ్యకృత్వ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా యానాం నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపడంతోపాటు ఢిల్లీలోని పార్లమెంట్లో మాట్లాడే అవకాశం దక్కుతుందన్నారు. విజేతలతో ప్రధాని నరేంద్ర మోడీ భేటీ అవుతారని ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9700515436, 0884-2321872 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా పందిరిరాట ముహూర్తం

యానాం చిల్డ్రన్స్ పార్కు సెంటర్లో విజయగణపతి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని పందిరి రాట ముహూర్తంను ఘనంగా నిర్వహించారు. విజయగణపతి కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పందిరిరాట వేశారు. ఈనెల 18 నుంచి గణపతి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈమేరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బ్యుటీషియన్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని ఒఎన్‌జిసి, ఏలూరుకు చెందిన సింధు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా బ్యూటీషియన్ ట్రైనింగ్ కోర్సును సోమవారం ప్రారంభించారు. నగరంలోని ఆవ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఒఎంఎస్ ప్రసిడెంట్ అనూద నారాయణ్,ఆలిండియా ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ పి.జగన్నాథరావు, పి.మాధవిమౌళి, సింధు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జి.సింధూర, బ్యూటీషియన్ పి.హారిక కుమారి హాజరయ్యారు.ఈ శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు మహిళలకు సూచించారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం

తరగతి గదులు ప్రారంభిస్తున్న మంత్రి వేణు

విద్యా ప్రమాణాలు ప్రోత్సహించడంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నూతనంగా నిర్మించిన తరగతి గదులను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గతంలో కళాశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులు తరగతి గదుల్లో సరైన సౌలభ్యం లేకపోవడం వల్ల అసౌకర్యానికి గురయ్యేవారని అన్నారు. కళాశాల యాజమాన్యం విజ్ఞాపన మేరకు కళాశాలల అభివద్ధి పరిచే విధంగా కషి చేశామని, దాని ఫలితంగా నూతన తరగతి గదులను ప్రారంభించడం గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో కళాశాలలో పాఠశాల అభివద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెసి.సత్య లత, పురపాలక సంఘం అధ్యక్షురాలు గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె. శ్రీకాంత్ రెడ్డి, ఎంపిడిఒ సలట్ రాజు, కౌన్సిల్ చీఫ్‌విప్ సాయి ప్రసాద్, కళాశాలఅధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు ,స్థానికప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి వద్ద గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందిన కె.గంగవరం మండలం అద్దంపల్లి గ్రామ యువకుడు పంపన శశి వీరేంద్ర కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.3 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు అయింది. ఈ చెక్కును మంగళవారం మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అందజేశారు. కోటిపల్లి వద్ద మహాశివరాత్రికి తన స్నేహితులతో కలిసి వచ్చి స్నానానికి దిగి విద్యార్థి వీరేంద్ర మతి చెందిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో అద్దం పల్లి సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, మండల ఉపాధ్యక్షులు దూడల నాగేశ్వరరావు, వైసిపి నాయకులు చింతపల్లి వాసు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-కొత్తపేట

పింఛన్ అందజేస్తున్నజెడ్‌పిటిసి సభ్యురాలు రమాదేవి

సంక్షేమం అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని రమాదేవి అన్నారు కొత్తపేట సచివాలయం-3 పరిధిలోని బ్యాంక్ కాలనీ, గోగివరి పేట గ్రామాలలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక ద్వారా నూతనంగా మంజూరైన వృద్ధ, వితంతు, వికలాంగ పెన్షన్లను లబ్ధిదారులకు జెడ్‌పిటిసి, స్టేట్ హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ మెంబర్ గూడపాటి రమాదేవి అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో సంక్షేమము పథకాలను లబ్ధిదారులకు నేరుగా వారి గృహాల వద్దని అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు పల్లి దిలీప్, గహ సారథులు, వాలంటీర్లు, తదితురులు పాల్గొన్నారు.

'చంద్రబాబు అరెస్టు సక్రమమే'

ప్రజాశక్తి-అమలాపురం

ఎఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టు అక్రమం కాదు సక్రమమే అని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురంలో మంత్రి విశ్వరూప్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు పట్ల ప్రజల్లో ఆందోళన లేదనీ ప్రశాంతంగా ఉన్నారని, బంద్ ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ లేదని అన్నారు. చంద్రబాబు విషయంలో పివి.రమేష్ మాట తప్పారనీ, 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలో అన్ని స్కీముల్లోనూ స్కామ్‌లేని అన్నారు. తప్పు చేసిన వ్యక్తి శిక్షించబడక తప్పదు అన్నట్లు రాష్ట్ర ప్రజలు ఆలోచనలో వున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబుపై మరిన్ని కేసులు వచ్చే అవకాశం ఉందన్నారు. కుంభకోణం కేసుల్లో స్టే లు తెచ్చుకుంటూ చంద్రబాబు బతికారనీ చట్టం దృష్టిలో దోషిగా తేలారని, శిక్ష అనుభవించక తప్పదని మంత్రి విశ్వరూప్ అన్నారు.

వంతెన పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విలసవిల్లి నుంచి వడ్డి వారి దళిత పేటకు వెళ్లే ప్రధాన రహదారిలో పంట కాలువపై వంతెన లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచ్ సలాది ఊర్మిళదేవి జెడ్‌పి నిధులు రూ.5 లక్షలతో పంట కాలువ పై వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం పనులను మంగళవారం సర్పంచ్ ఊర్మిళదేవి పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, చేనేత సొసైటీ అధ్యక్షుడు పుచ్చల ఏసు, సచివాలయ కన్వీనర్ కోలా ఏసు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఔట్ పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామంలో పరిధిలో జగనన్న లేఔట్ ను జిల్లా హౌసింగ్ పీడీ సిహెచ్.బాబురావు, గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ సిహెచ్.బాబురావు ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకునేలా చూడాలని ఎఇకి ఆదేశించారు. కార్యక్రమంలో అల్లవరం హౌసింగ్ ఎఇ సుబ్బారావు, ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

మండల స్థాయి స్పందన వాయిదా

ప్రజాశక్తి-అమలాపురం

అన్ని జిల్లాల కలెక్టర్లతో ఈ నెల 13న ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ ఉన్న కారణంగా బుధవారం కొత్తపేట మండల స్థాయి లో నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడిందని కలెక్టర్ కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైస్ మిల్లుల బకాయిలు చెల్లించేందుకు చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో రైస్ మిల్లులకు సంబంధించిన బకాయిలను ప్రాధాన్యత క్రమంలో చెల్లించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపు మందిరంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో సమా వేశం నిర్వహించి రానున్న ఖరీఫ్ సీజన్లో ముందస్తు సన్నద్ధత, పెండింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం రవాణాకు ఉపయోగించే వాహనాలను ముందస్తుగా ఆర్‌బికె లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రతి లారీ, ట్రక్కు నమోదు కావాలని ఆదేశించారు. పెండింగ్ బకాయిలు దశలవారీగా ప్రాధాన్యత క్రమంలో చెల్లించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు, గోనె సంచులు, యూజర్ ఛార్జీలు, డ్రైయర్ల ఏర్పాటు, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం రవాణా ఛార్జీల పెండింగ్ అంశాలపై మిల్లర్ల తో సుదీర్ఘంగా చర్చించి చెల్లింపులకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి మండలంలో ఒక డ్రైయర్ ఏర్పాటు చేయాలని సూచించారు. గోనెసంచుల సరఫరా తదితర అంశాలపై పటిష్టమైన చర్యలు ముందస్తుగా చేపట్టి రైస్ మిల్లర్లకు ఎటువంటి అసౌకర్యం ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత పౌరసరఫరాలు జిల్లా సహకార అధికారులపై ఉందని ఆ దిశగా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు ఈ సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు పట్టాభి రామయ్య చౌదరి. కార్యదర్శి ఇండిగల బుజ్జి, రైస్ మిల్లర్ల ప్రతినిధులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎస్.సుధా సాగర్ జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు, జిల్లా సహకార అధికారి రాధాకష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

అమలాపురం మండలం, పాలగుమ్మి గ్రామంకు చెందిన ముంజవరపు వెంకటరమణ, S/o. నాగ సుబ్రహ్మణ్యంకు చెందిన పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబరు **N7487980.** సెప్టెంబరు 6వ తేదీన జిరాక్స్ నిమిత్తము పాలగుమ్మి నుండి ఈదరపల్లి వచ్చుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ముంజవరపు వెంకటరమణ
S/o. నాగ సుబ్రహ్మణ్యం
డోర్ నెంబర్: 2-83, పాలగుమ్మి
అమలాపురం మండలం
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 81431 89889

ఓజోన్ పరిరక్షణ దినోత్సవ వేడుకలకు రెండు పాఠశాలల ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాస్థాయిలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ వేడుకలకు రెండు పాఠశాలను ఎంపిక చేశామని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రామచంద్రపురం డివిజన్ నుంచి సత్యవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలను, అమలాపురం డివిజన్ నుంచి అంబాజీపేట మండలం జెడ్‌పి ఉన్నత పాఠశాల తొండవరంలను ఎంపిక చేశామన్నారు. ఈ నెల 16న తొండవరం, సత్యవాడ పాఠశాలలో జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో విద్యార్థి, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఓజోన్ పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తెలియజేసే విధంగా ర్యాలీ కూడా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాల కొరకు జిల్లాస్థాయి ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంగీతం రామకృష్ణ సత్యారామ్ వారిని సెల్: 9666212381 నందు సంప్రదించవచ్చునని ఆయన ప్రకటనలో తెలిపారు.

స్వరూప ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అమలాపురం

వినికిడి యంత్రాలు అందజేస్తున్న దృశ్యం

వినికిడి లో పాలతో బాధ పడుతున్న చిన్నారులకు వినికిడి యం త్రాలు న్యూఢిల్లీకి చెందిన స్వరూప్ చారిటబుల్ ట్రస్ట్ ఉచితంగా అందించిందని, ఆ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇంజేటి జాన్‌లేవి ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి జిల్లా సత్వర వైద్య సేవల కేంద్రం నందు వినికిడి లోపాలతో బాధపడు తున్న 90 మంది చిన్నారులకు స్వరూప్ చారిటబుల్ ట్రస్ట్ కు చెందిన సంచాలకులు సురేష్ జె.పిల్లై , రవి శర్మ సురజిత్ పెయిన్, రాహుల్ సలేశ ఉచిత వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, అమలాపురం

ఆర్‌ఓసి నెం. 612/2022-బి3 ది. 12-09-2023

టెండరు నోటీసు

2023-2024వ సంllరంనకు అమలాపురం పురపాలక సంఘ కార్యాలయమునకు మరియు సచివాలయములకు అవసరమైన స్టేషనరీ మరియు కంప్యూటరీ ఉపయోగమునకు కావలసిన సామగ్రి సరఫరా చేయుటకు అంచనాలు రూ. 6,50,000/-లతో సీలు వేసిన టెండరును ది. 26-09-2023న మంగళవారం సాయంత్రం గంll 4.00లకు కమిషనరు వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడి అదే రోజు సాయంత్రం గంll 4.30 నిllలకు అప్పటికి హాజరైన కంట్రాక్టర్ల సమక్షములో టెండర్లు తెరువబడును.

మిగిలిన వివరములు ఆఫీసు కార్యాలయ పనివేళల నందు తెలుసుకొనవచ్చును.

సం/- **కమిషనరు**
అమలాపురం పురపాలక సంఘం

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం. 62/2023
ఓ.ఎస్.నెం. 363/2019

బిట్వీన్:
శ్రీ బోడపాటి గంగాధరరావు, తండ్రి: వీర్రాజు, నివాసము: డో.నెం. 2-138, మద్దూరు, కొవ్వూరు మండలం, తూllగోllజిల్లా.
...పిటీషనరు /వాది

మరియు

శ్రీ బోడపాటి శేషు, తండ్రి: దుర్గారావు, నివాసము: డో.నెం. 3-186, మద్దూరు, కొవ్వూరు మండలం, తూllగోllజిల్లా.
...రెస్పాండెంటు /ప్రతివాది

పై నెంబరు పిటీషనులో రెస్పాండెంటు /ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించుచున్నప్పటికీ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపించుచున్నందు, నోటీసులు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా అమలు పరచుటకు ఉత్తర్వులు ఇచ్చినందున పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున **ది.15-09-2023వ తేదీ ఉదయం గంll10:30 నిllలకు మీయొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. ఆరోజున మీకు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేదీ : 15-09-2023

శ్రీ టి.ఎన్.వి.రమణమూర్తి
శ్రీ యం.గోపి
అడ్వకేట్స్, కొవ్వూరు.
సెల్: 98487 61670

కొవ్వూరు,
12-9-23.